సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 24 ఏప్రిల్ । 2024



ఫామ్‌లో ఉంటేనే ప్రాధాన్యత!

నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు పలు ఫారాలు నింపాల్సి ఉండగా, ఒక్కో ఫాంకు ఒక్కో ప్రాధాన్యత ఉంటుంది. 8లో



నచ్చకపోతే 'నోటా'

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నచ్చకపోతే ఒకప్పుడు ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉండే వారు. ఇప్పుడు నోటాకు ఓటేస్తున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం

40° / 25°

జిల్లాలో బుధవారం ఎండ అధికంగా ఉంటుంది. గంటగంటకూ ఉష్ణోగ్రత పెరగడంతో పాటు రాత్రి కూడా వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వశక్తితో అభివృద్ధి చెందాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పీఓ

భద్రాచలం : ఇంటివద్ద ఉండే గిరిజన మహిళలు సమయాన్ని వృథా చేయకుండా ప్రభుత్వ చేయూతను ఉపయోగించుకుని స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం ఓం శక్తి గ్రూప్ ఆదివాసీ మహిళలు తయారుచేసిన సెంట్, ఫినాయిల్, సర్ఫ్, క్యాండిల్స్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో 20 మంది ఆదివాసీ మహిళలు శిక్షణ తీసుకోవడం, సొంతంగా వ్యాపారం ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. వస్తువుల మార్కెటింగ్‌కు ఐటీడీఏ తరఫున సహకరిస్తామని చెప్పారు. అంతకుముందు జరిగిన మరో కార్యక్రమంలో పీఓ మాట్లాడుతూ.. భూగర్భ జలాల పెంపునకు గిరిజనులు, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ ఎస్‌ఓ సురేష్ బాబు, మహిళా గ్రూప్ అధ్యక్షురాలు కొండ్రు సుధారాణి, సీఆర్‌పీఎఫ్ 141 కమాండెంట్ ప్రీతిశ్రీ, గ్రూప్ సభ్యులు సీతామాలక్ష్మి, లత, హర్షిని, వసుంధర, తిరుమల, రాజ్యలక్ష్మి, హరిణి, వసంత, అనసూయ, తిరుపతమ్మ, గీత, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ శ్రీనివాస్, అశోక్‌కుమార్, నరేష్, ప్రభాకర్‌రావు, భారత రూరల్ లల్లీ వుడ్ బృందం సభ్యులు సుమిత్ రాయ్, అరవింద్, మధుసూదన్, తివారి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖకు రూ.80 లక్షల ఆస్తి నష్టం

కొత్తగూడెంరూరల్ : జిల్లాలో ఈనెల 21న వీచిన గాలిదుమారం, పిడుగులతో కూడిన వర్షంతో జిల్లా విద్యుత్ శాఖకు రూ. 80 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని ఎస్‌ఈ కె. రమేష్ తెలిపారు. కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్, పాల్వంచ, ములకలపల్లి, పినపాక, కరకగూడెం మండలాల్లో 338 విద్యుత్ స్తంభాలు పడిపోయాయని, 48 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని తెలిపారు. యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టామని పేర్కొన్నారు.

ఇదేం అద్భుతమో?



అల్లావుద్దీన్ అద్భుత దీపాన్ని తలపించే పరిస్థితి చర్ల మండలంలోని ఇసుక రీచ్‌ల్లో నెలకొంది. ఇక్కడ ఎంత ఇసుకను అమ్మేసినా తెల్లవారేసరికి కొత్త రాశులు పుట్టుకొస్తున్నాయి. భారీ యంత్రాలను ఉపయోగించకుండానే నిమిషాల వ్యవధిలో టన్నుల కొద్దీ ఇసుక నది నుంచి స్టాక్ పాయింట్‌కు చేరుకుంటోంది. నమ్మశక్యం కాకపోయినా ఇక్కడి రెవెన్యూ అధికారులు చెబుతున్న మాటలు ఈ విధంగానే ఉన్నాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

తరిగిపోని ఇసుక రాశులు

- రెండు నెలలుగా తవ్వకంపై నిషేధం
- స్టాక్ పాయింట్‌లో నిల్వల అమ్మకాలకే అనుమతి
- రాష్ట్ర రాజధానికి లారీల్లో భారీగా రవాణా
- అయినా చర్ల స్టాక్ పాయింట్లలో తగ్గని ఇసుక !

గోదారి తీరం.. విధుల్లో నిర్లక్ష్యం

గత ప్రభుత్వం రూపొందించిన ఇసుక అమ్మకం విధానం లోపభూయిష్టంగా మారింది. కొత్త విధానం రూపొందించే వరకు నదీ గర్భం నుంచి ఇసుక తీయొద్దని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుకను మాత్రమే అమ్ముకోవాలని రెండు నెలల క్రితం ప్రకటించింది. స్థానిక అవసరాల కోసం సమీపంలో ఉన్న వాగుల్లో ఇసుకను వాడుకోవచ్చని తెలిపింది. అయితే ఇటీవల ఇసుక తరలిస్తున్న ఎడ్లబండ్లను కొత్తగూడెం పోలీసులు తెల్లవారుజామున పట్టుకున్నారు. విచారణ చేస్తే స్థానిక అవసరాల కోసం కాకుండా వ్యాపార అవసరాలకు ఎడ్ల బండ్లలో ఇసుకను తరలిస్తున్నట్టు తేలింది. దీంతో రెవెన్యూ విభాగానికి సమాచారం అందివ్వగా వారు ప్రతీ ఎడ్ల బండికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు. జిల్లా అంతటా రెవెన్యూ, పోలీసు, ఇతర ప్రభుత్వ విభాగాలు విధి నిర్వహణలో శ్రద్ధ చూపిస్తుంటే గోదావరి తీరం వెంబడి ఇందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి.



కొత్తగూడెంలో ఇసుక తరలిస్తుండగా ఫైన్ వేసిన ఎడ్ల బండ్లు(ఫైల్)

ధరలకు హద్దే లేదు..

వేసవి కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ రంగం ఊపందుకుంది. మరోవైపు ప్రభుత్వ ఆదేశాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు తగ్గిపోయాయి. దీంతో చర్ల మండలంలో గోదావరి తీరం వెంట కొత్త ఇసుక దందాకు తెర లేపారు. రాత్రి వేళలో భారీ యంత్రాలతో ఇసుక తోడుతూ స్టాక్ పాయింట్లకు చేరవేస్తూ ఇటు ప్రభుత్వ ఆదేశాలను, అటు పెసా చట్టం అమలును గోదావరిలో పాతరేస్తున్నారు. మరోవైపు పెరిగిన డిమాండ్ ఆధారంగా ఇసుక ధరలను విచ్చలవిడిగా పెంచేశారు. దీంతో టీఎస్‌ఎండీసీ ఫీజు, రవాణా చార్జీలు కలిపి మూడు నెలల క్రితం హైదరాబాద్ శివారులో టన్ను ఇసుక ధర సుమారు రూ.1,400 ఉండగా ఇప్పుడు రూ. 2,700కు చేరింది. ప్రతీ టన్నుపై కనీసం అదనంగా రూ.వెయ్యి వరకు కృత్రిమంగా ధర పెంచేశారు. దీంతో ఒక్కో లారీపై కనీసం రూ.25 వేల వరకు లాభం అప్పనంగా వచ్చిపడుతోంది. లెక్కాపత్రం లేకుండా వచ్చిన ఈ ఆదాయాన్ని ఇసుక మాఫియా అమ్యామ్యాలకు ఖర్చు చేస్తోంది. ఇలా అడ్డగోలుగా దోపిడీ జరుగుతున్నా అడ్డుకట్ట వేసేవారు లేకుండా పోయారనే ఆరోపణలు వస్తున్నాయి.

అధికారులు కన్నెత్తి చూడరు..

కొత్తగూడెం వంటి పట్టణాల్లో ఎడ్ల బండ మీద వెళ్లే ఇసుకపై కూడా నజర్ ఉండగా, భద్రాచలం ఏజెన్సీలో ఇందుకు విరుద్ధంగా భారీ యంత్రాలతో పట్టపగలే ఇసుక తవ్వకాలు జరుగుతున్నా, లారీల్లో ఓవర్‌లోడ్‌తో రవాణా అవుతున్నా నిఘా కరువైంది. ఇసుక తవ్వకంపై రెండు నెలలుగా నిషేధం ఉన్నా, స్టాక్ పాయింట్లలో ఇసుక రాశులు తరిగిపోని వైనంపై పట్టింపన్నది కనిపించడం లేదు. మైనింగ్, రవాణా శాఖలు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. ముఖ్యంగా ఏజెన్సీ చట్టాలను పక్కాగా అమలు చేస్తూ స్థానిక గిరిజనులకు అండగా నిలవాల్సిన రెవెన్యూ విభాగం పూర్తిగా చేతులెత్తేసింది. కళ్లెదుటే నదీ గర్భంలో భారీ యంత్రాలు తిరుగుతున్నా అడ్డుకునే వారు కరువయ్యారు.

భారీ యంత్రాలు లేవు

నది నుంచి భారీ యంత్రాలతో ఇసుక తోడడం చట్టరీత్యా నేరం. చర్ల మండలంలో గోదావరి నదిలో ఏ రీచ్‌లో కూడా భారీ యంత్రాలతో ఇసుక తోడటం లేదు. కేవలం స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకనే అమ్ముతున్నారు. మన ఇసుక – మన వాహనం పథకానికి ఇక్కడ ఆదరణ లేదు.

– శ్రీనివాస్, చర్ల తహసీల్దార్

కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



దుమ్ముగూడెం : బలరాంనాయక్‌ను పరిచయం చేస్తున్న మంత్రి తుమ్మల

- 20 రోజులు కష్టపడండి.. ఐదేళ్లు సేవకులుగా పనిచేస్తాం
- ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల

దుమ్ముగూడెం / మణుగూరుటౌన్ : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దయతో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతోందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాహుల్ మంత్రివర్గంలో మహబూబాబాద్ ఎంపీగా గెలుపొందే పోరిక బలరాం నాయక్‌కు స్థానం దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన దుమ్ముగూడెం మండలం గంగోలు, మణుగూరుల్లో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశాల్లో మాట్లాడారు. బలరాంనాయక్ గెలుపుకోసం ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరినీ ఐక్యంగా ఉంచి, సమభావంతో చూసే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, మతతత్వ బీజేపీని, అవినీతిమయమైన బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు వామపక్షాలు, కాంగ్రెస్ ఏకతాటిపైకి వచ్చాయని అన్నారు. తాను గతంలో కూడా మంత్రిగా ఏజెన్సీ అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. తాలిపేరు, పాలెం వాగు వంటి ప్రాజెక్టుల నిర్మాణంతో రైతుల కష్టాలు తీర్చామని తెలిపారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పూర్తయితే ఇక్కడే 350 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. పినపాక నియోజకవర్గంలో పులుసుబొంత ప్రాజెక్టుకు అటవీ అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. భద్రాచలం – జగదల్‌పూర్, భద్రాచలం – ఏటూరునాగరం జాతీయ రహదారులు పూర్తయ్యాయని, బలరాం నాయక్ కేంద్ర మంత్రి అయితే భద్రాచలం – రాజమండ్రి జాతీయ రహదారి నిర్మాణం పూర్తవుతుందని అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలును కృతనిశ్చయంతో చేపట్టామని, ఎన్ని అడ్డంకులు వచ్చినా అమలులో వెనక్కి తగ్గేది లేదని చెప్పారు. ఆగస్టు 15 లోపే రైతు రుణమాఫీ కూడా అమలు చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 17 స్థానాలు గెలిస్తే సీఎం రేవంత్‌రెడ్డికి ఇంకా బలం పెరుగుతుందని, తద్వారా పెండింగ్ సమస్యలు పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ 20 రోజులు కార్యకర్తలు కష్టపడి బలరాం నాయక్‌ను గెలిపిస్తే వచ్చే ఐదేళ్ల పాటు సేవకులుగా పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశాల్లో పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్‌తో పాటు డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు బొల్లోజు అయోధ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ సభ్యులు చందా సంతోష్, దుర్గంపూడి కృష్ణారెడ్డి, నాయకులు పోలెబోయిన శ్రీవాణి, బట్టా విజయ్‌గాంధీ, కాటబోయిన నాగేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి త్యాగరాజన్, అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, మణుగూరు వైస్ ఎంపీపీ కేవీరావు, భోగినేని వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మావోలు సైతం సహకరించాలి

మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌కు మావోయిస్టులు కూడా సహకరించి గెలిపించాలని మంత్రి తుమ్మల అన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో ఉన్నా భద్రాచలంలో అనేక అభివృద్ధి పనులు చేశామని, ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టులు చంపుతామని బెదిరించినా అభివృద్ధి ఆపలేదని తెలిపారు. ప్రాణాలకు లెక్క చేయకుండా పరిపాలన అందించామని, భద్రాచలంలో కమ్యూనిస్టులు గెలుపొందిన సమయంలో కూడా అభివృద్ధి కొనసాగించామని చెప్పారు. గతంలో తాను మంత్రిగా పనిచేసిన సమయాన ఎన్నోమార్లు మావోయిస్టులు ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించవద్దని హెచ్చరించగా.. ఇవాళ చస్తే రేపటికి రెండో రోజు అన్నట్లు ప్రజలకు సేవ చేస్తూ చనిపోతే అంతకంటే సంతోషం మరొకటి లేదనే భావనతో వాగులు, వంకల్లో జీపులు వేసుకొని తిరిగామని గుర్తు చేశారు. అప్పట్లో తమ కోసం అమర్చిన మందుపాతర కూడా పేలలేదని తెలిపారు. నిక్కచ్చిగా, నిస్వార్థంగా పనిచేస్తే మందుపాతరలు కూడా పేలవని తుమ్మల పేర్కొన్నారు. 'తుమ్మల ప్రజల కోసం పనిచేస్తున్నాడు కాబట్టే మా మందుపాతరలు కూడా పేలడం లేదు' అని మావోయిస్టులు ఆరోజు ప్రకటించారని తెలిపారు. అడవుల్లో ప్రాణాలు పణంగా పెట్టి గిరిజనుల అభివృద్ధి కోసం మావోలు ఉద్యమిస్తుండగా.. అదే గిరిజనులు, అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి పాటుపడే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిచేలా తమకు మద్దతు ఇవ్వాలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఈ సందర్భంగా మావోయిస్టు పార్టీకి విజ్ఞప్తి చేశారు.

బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

- సుదర్శన చక్రానికి గోదావరిలో చక్రస్నానం
- రామయ్యకు ప్రత్యేక స్నపనం



పునర్వసు మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 9న ప్రారంభమైన వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక తిరుకలాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజున స్వామివారి సుదర్శన చక్రానికి పవిత్ర గోదావరి నదిలో చక్రస్నానం వేడుకను కమనీయంగా నిర్వహించారు. సుదర్శన చక్రాన్ని, ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీలో మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ గోదావరి నది వద్ద గల పునర్వసు మండపానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ మూర్తులకు మండపంలో స్నపన తిరుమంజనం, హారతి సమర్పించారు. అనంతరం గోదావరిలో సంప్రదాయబద్ధంగా చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణం, దేవతోద్వాసనం, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు జరిపించారు. యాగశాలలో పుష్పయాగం, పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ రమాదేవి, ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిత్యకల్యాణాలు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా నిలిపివేసిన స్వామివారి నిత్యకల్యాణాలు, దర్బారు సేవలు బుధవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. మే 2న స్వామివారి నూతన పర్యంకోత్సవం, ఆ రోజు నుంచే పవళింపు సేవలు జరగనున్నాయి.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

అశ్వారావుపేట/సింగరేణి(కొత్తగూడెం): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని సోలార్‌ప్లాంట్‌ను సందర్శించారు. అనంతరం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటించారు. అశ్వారావుపేట సబ్ డివిజన్ గండుగులపల్లి, అంకంపాలెం, పట్వారిగూడెం, మల్కారం, అశ్వారావుపేట, నారంవారిగూడెం, అచ్యుతాపురం సబ్ స్టేషన్‌ల పరిధిలోని విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ పంపిణీని పర్యవేక్షించారు. ఆయిల్‌ఫాం అత్యధికంగా సాగవుతున్న ఈ రెండు మండలాల్లో తలెత్తుతున్న సమస్యలు, తీసుకుంటున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగూడెంలో సోలార్ ప్లాంట్ విస్తీర్ణం, విద్యుత్ ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో సింగరేణిలో చేపట్టనున్న 232 మెగావాట్ల సోలార్, స్టోరేజ్, పవన విద్యుత్ ప్లాంట్‌ల గురించి సింగరేణి అధికారులు సీఎండీకి వివరించారు. అంతకుముందు సింగరేణి ఈఅండ్‌ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు, జీఎం శాలేంరాజు సీఎండీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో వరంగల్ ఏడీ(టెక్నికల్) హుస్సేన్, ఆర్‌ఎంటీ డీఈఈ రమేష్, ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ కె. రమేష్, ఏస్ఏఓ ఈ.మురళి, డీఈఈ జస్వంత్, ఏడీఈ బి. వెంకటేశ్వరరావు, సింగరేణి సోలార్ జీఎం జి.జానకీరామ్, వర్క్‌షాప్ జీఎం దుర్గాప్రసాద్, ఎస్‌వో టు డైరెక్టర్ కె.వి.రావు, బి. శంకర్, విద్యుత్ శాఖ ఏఈలు మహేష్, శరత్, సంతోష్, సాయి పాల్గొన్నారు.



సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఈ రమేష్

సీఎండీకి ఘన స్వాగతం

ఇల్లెందు/ఇల్లెందురూరల్: జిల్లా పర్యటనకు వచ్చిన సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి విద్యుత్‌శాఖ అధికారులు ఇల్లెందు – బయ్యారం మండలాల సరిహద్దులోని నెహ్రూనగర్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమేష్, డీఈ నందయ్య, ఎస్ఏఓ మురళి, ఏడీఈ కోటేశ్వరరావు, డీఈ (ఎంఆర్‌టీ) రాంబాబు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఐదోరోజు ఎనిమిది నామినేషన్లు

రెండు సెట్లు సమర్పించిన మానుకోట బీఆర్‌ఎస్ అభ్యర్థి కవిత

మహబూబాబాద్: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఐదో రోజైన మంగళవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత రెండు సెట్ల నామినేషన్లు సమర్పించారు. ఆమె వెంట రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్లు నాగజ్యోతి, అంగోతు బిందు పాల్గొన్నారు. అలాగే, స్వతంత్ర అభ్యర్థులుగా ప్రేమ్‌లాల్, ఆదివాసీ జేఏసీ నాయకుడు చందా లింగయ్య, శ్యామల నాయక్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి మోకాళ్ల మురళీకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. వీరితో పాటు ఇంతకు ముందు నామినేషన్ వేసిన ఆధార్ పార్టీ అభ్యర్థి రఘునాయక్, స్వతంత్ర అభ్యర్థి ఎర్రయ్య మరో సెట్ సమర్పించారు. ఇప్పటి వరకు 13 మంది అభ్యర్థులు 19 సెట్ల నామినేషన్లు సమర్పించారని అధికారులు తెలిపారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత

విద్యార్థుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట : దేశం, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే విద్యార్థుల భాగస్వామ్యంతోనే సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి వి.బాబూరావు అన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన నారాయణపురంలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయ కోర్సు చదువుతున్న విద్యార్థులు శాస్త్రవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ద్వారా గ్రామాభివృద్ధికి తోడ్పడే అవకాశం దక్కుతుందన్నారు. విద్యార్థులంతా వారం రోజులపాటు గ్రామ రైతులు, ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలను చేపట్టాలని చెప్పారు. ముందుగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ ఎన్‌ఎస్‌ఎస్ జెండా ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 29 వరకు సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించండి

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలని బాబూరావు ఆదేశించారు. మండలంలోని ఊట్లపల్లి, నారాయణపురం, అశ్వారావుపేట, దమ్మపేటల్లో కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, ధాన్యంలో తేమ శాతాన్ని పరీక్షించారు. తేమ శాతం తగ్గాకనే తూర్పారా పట్టాలని సూచించారు. ఎండలు అధికంగా ఉన్నందున ప్రతీ కేంద్రం వద్ద నీడ కోసం టెంట్, తాగు నీరు, కుర్చీలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం అశ్వారావుపేటలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగు క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో రవి సీడ్స్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.రవి, ఏడీఏ అఫ్జల్‌బేగం, ఏఓ నవీన్, కళాశాల శాస్త్రవేత్తలు గోపాలకృష్ణ మూర్తి, రాంప్రసాద్, రెడ్డి ప్రియ, మధుసూదన్‌రెడ్డి, రమేష్, వ్యవసాయాధికారులు సాయి నారాయణ, ఏఓలు చంద్రశేఖరరెడ్డి, చంద్రశేఖర్, ఏఈఓలు దీప్తి, షాకిరా భాను పాల్గొన్నారు.



అశ్వారావుపేటలో మాట్లాడుతున్న డీఏఓ బాబూరావు

అక్రమ రవాణా అరికట్టాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, అక్రమ మద్యం, డబ్బు రవాణాను అరికట్టాలని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. మంగళవారం ఏలూరు, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కలెక్టర్లు గూగుల్‌మీట్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ.. ఇరు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 19వేల లీటర్ల మద్యం సీజ్ చేశామని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని, అక్రమ రవాణా జరుగకుండా చర్యలు చేపట్టామని వివరించారు. పోలీస్, అటవీ శాఖ అధికారుల సమన్వయంతో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. బోగస్ ఓటింగ్‌ను నివారించేందుకు చివరి 48 గంటల్లో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఓటర్ల తనిఖీలు చేపతామని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్య, వాణిజ్య పన్నుల శాఖ అధికారి సింధు, డీసీఓ ఖుర్షీద్, సేల్స్ ట్యాక్స్ అధికారి మేరీ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

- అమ్మ ఆదర్శ కమిటీలకు కలెక్టర్ ప్రియాంక ఆల సూచన
- మణుగూరులో స్ట్రాంగ్‌రూం పరిశీలన



పినపాక మండలం జానంపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, అధికారులు

కరకగూడెం/మణుగూరురూరల్/సూపర్‌బజార్(కొత్తగూడెం): అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. పినపాక మండలం పాండురంగాపురం ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను, పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. తాగునీటి కోసం నిర్మిస్తున్న సంప్‌లు పాఠశాలకు సమీపంలోనే ఉండాలని, వేసవి సెలవులు ముగిసేలోగా పనులన్నీ పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రాబోయే విద్యా సంవత్సరంలో బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. తమకు నెలరోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని కొందరు మహిళలు కలెక్టర్ దృష్టికి తేగా.. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలని ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలను ఆదేశించారు. సుందరయ్యనగర్ గొత్తి కోయల గ్రామాన్ని సందర్శించి తాగునీటి సదుపాయాలు, పాఠశాలలో వసతులపై ఆరా తీశారు. అనంతరం మణుగూరులోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా, ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ ఉండాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత చర్యలు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. ఆ తర్వాత కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పాఠశాలల్లో పనులపై హెచ్‌ఎంలకు పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఈఓ వెంకటేశ్వరాచారి, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు సతీష్‌కుమార్, సైదులు, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, పినపాక తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ వీరస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకృష్ణ, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.రాఘవరెడ్డి, డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఎస్సై సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

దేవా.. మరోమారు కనికరించు...

భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో బీఆర్‌ఎస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి నామ నాగేశ్వరరావు మంగళవారం పూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. అలాగే, పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో కూడా నామ పూజలు చేశారు. బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా ఆలయాల్లో పూజలు చేసినట్లు ఆయన తెలిపారు. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, ఆకోజు సునీల్‌కుమార్, కోలా రాజు, టీడీపీ నాయకుడు ఎస్.కే.అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

- భద్రాచలం/పాల్వంచ రూరల్



భద్రాచలంలో ధ్వజస్తంభం వద్ద నామ నాగేశ్వరరావు



క్రీడా మైదానంలో మాట్లాడుతున్న బలరామ్‌నాయక్

అటు వాకింగ్.. ఇటు ప్రచారం

భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరామ్‌నాయక్ మంగళవారం మార్నింగ్ వాక్ చేశారు. వాకర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి తనను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భోగాల శ్రీనివాసరెడ్డి, నాయకులు తోటకూర రవిశంకర్, పరిమి శ్రీనివాస్, జాలకంటి సీతారాంరెడ్డి, బొలిశెట్టి రంగారావు, రాసమల్ల రాము, ఎస్.కే.అలీపాషా, సిద్ది గణేష్, బస్వ రాజు పాల్గొన్నారు.

- భద్రాచలంటౌన్

క్లుప్తంగా

చలివేంద్రాలు శ్రద్ధతో నిర్వహించాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



చలివేంద్రాన్ని ప్రారంభించిన ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

బూర్గంపాడు: చలివేంద్రాలను మొక్కుబడిగా కాకుండా ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. సారపాక ప్రధాన కూడలిలో ఐటీసీ, గ్రామపంచాయతీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండుటెండలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. శుద్ధమైన జలాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపీడీఓ జమలారెడ్డి, ఐటీసీ పీఎస్‌పీడీ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) చెంగలరావు, గ్రామపంచాయతీ ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందచేస్తున్న ఆలయ ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి మంగళవారం ఏపీకి చెందిన భక్తులు విరాళం అందచేశారు. కడప జిల్లా మైదుకూరు వాసి ఎం.జయరాముడు – లక్ష్మీదేవి దంపతులు రూ.50 వేలను ఆలయ అధికారులకు అందజేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగి లింగాల సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో భక్తులతో అనుచిత ప్రవర్తన



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు రాధాకృష్ణ

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తుల పట్ల సెల్‌ఫోన్ల భద్రపరిచే వ్యక్తులు అనుచితంగా ప్రవర్తించినట్టు బాధితులు ఆలయ అధికారి అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆలయ ప్రవేశ ద్వా రం వద్ద ఉన్న సెల్‌ఫోన్ భద్రపరిచే వ్యక్తులు అడ్డగించి రుబాబుగా మాట్లాడారని హైదరాబాద్‌కు చెందిన రాధాకృష్ణ కుటుంబ సభ్యులు ఆరోపించారు. భక్తులకు మర్యాదగా సెల్‌ఫోన్‌లు అనుమతి లేదని చెప్పాల్సింది పోయి, దారికి అడ్డంగా నిలబడి ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని పేర్కొన్నారు. ఈ ఘటనపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరకుండా చూడాలని దేవస్థానం అధికారులను కోరాడు. కాగా జరిగిన ఘట నపై ఆలయ అధికారి అనిల్‌కుమార్ సెల్‌ఫోన్ భద్రపరిచే వ్యక్తులతో మాట్లాడారు. భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

అశ్వాపురం: మండుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు తగిన కనీస సౌకర్యాలు కల్పించాలని డీఆర్‌డీఓ విద్యాచందన అధికారులు, సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఆమె సందర్శించి, కూలీలతో మాట్లాడారు. తాగునీరు, మెడికల్, నీడ తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ విద్యాచందన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్, ఏపీఎం సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఫామ్’లో ఉంటేనే ప్రాధాన్యత ! నచ్చకపోతే ‘నోటా’

- ఒక్కో ఎన్నికకు ఒక్కో రకం నంబర్
- ప్రతీ ఫామ్‌కు ఓ లెక్క
- బీ ఫామ్ ఆధారంగా గుర్తుల కేటాయింపు..



ఖమ్మం సహకారనగర్/ఖమ్మంమయూరిసెంటర్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఈనెల 18న విడుదలైంది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి ఫాం–1 ద్వారా నోటిఫికేషన్ జారీ చేశారు. నాటి నుండి అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నారు. ఇందులోనే అభ్యర్థులు నామినేషన్ ఎప్పుడు, ఎక్కడ, ఏ సమయాన, ఎవరికి దాఖలు చేయాలో స్పష్టంగా ప్రస్తావించారు. అలాగే, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు సంబంధించిన వివరాలనూ పొందుపర్చారు. వీటితో పాటు పోలింగ్ ఏ రోజు, ఎప్పుడు జరుగుతుందో కూడా వెల్లడించారు. ఇందులోని వివరాల ఆధారంగానే అభ్యర్థులు ముందుకు సాగాల్సి ఉంటుంది. అలాగే, ఎన్నికల వేళ వివిధ నంబర్లతో జారీ చేసిన ఫామ్‌లకు ప్రాధాన్యత ఉంటుంది.

● ఫాం–2

లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఫాం -2ఏ ద్వారా నామినేషన్ దాఖలు చేయాలి. ఈ ఫామ్‌నే నామినేషన్ పత్రంగా పేర్కొంటారు. శాసనసభకు ఫాం–బీ, రాజ్యసభ, శాసన మండలికి ఫాం -2సీలో నామినేషన్ సమర్పిస్తారు. అభ్యర్థులకు నామపత్రాలను కేంద్ర ఎన్నికల సంఘమే ఉచితంగా సమకూరుస్తుంది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నామపత్రాలకు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంతో పాటు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోని సహాయ రిటర్నింగ్ అధికారి లేదా తహసీల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. వీటిని పూరించడంలో సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు హెల్ప్ డెస్క్‌లు సైతం ఏర్పాటుచేశారు.

● ఫామ్–ఏ

రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల పేర్లను ఫాం–ఏ ద్వారా తెలియజేస్తాయి. వీటిపై ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులు లేదా ప్రధాన కార్యదర్శి సంతకంతో పాటు ముద్ర ఉంటుంది. పార్టీ ఎవరిని అభ్యర్థిని ఎంపిక చేసిందో చెప్పేదే ఈ ఫామ్. ఇందులో పార్టీ పేరు, పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి పేరు తదితర వివరాలు ఉంటాయి.

● ఫామ్–బీ

పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి వీరే అని పార్టీ ప్రతినిధి ఇచ్చేదే బీ–ఫామ్. దీన్ని నామినేషన్ సమయాన ఎన్నికల అధికారులకు అందజేయాలి. నామినేషన్ల చివరి రోజు మధ్యాహ్నం 3గంటల్లోపు అందచేయొచ్చు. సదరు పత్రంలో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు, నియోజకవర్గ వివరాలతో పాటు పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. నామినేషన్‌తో పాటు అభ్యర్థి బీ–ఫామ్‌ను జతచేస్తేనే రిటర్నింగ్ అధికారి ఆ పార్టీ ఎన్నికల గుర్తు కేటాయిస్తారు. అభ్యర్థి సమర్పించే ఫామ్–ఏ, బీలను పరిశీలించి అభ్యర్థి సదరు పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థి సకాలంలో సరైన ఫామ్ సమర్పించకపోవడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఇలాంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని అన్ని వివరాలు, పత్రాలు సరిచూసుకోవాల్సి ఉంటుంది.

● అఫిడవిట్‌కూ ప్రాధాన్యత

నామినేషన్ పత్రంతో పాటు ఫామ్–26(అఫిడవిట్) సైతం అభ్యర్థులు విధిగా సమర్పించాలి. ఇందులో అభ్యర్థులు తమతో పాటు కుటుంబ సభ్యుల ఆస్తులు, అప్పులు వివరాలను పొందుపర్చాలి. అలాగే, క్రిమినల్ కేసులు, న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది.

- ఈవీఎంల్లో ప్రత్యేక గుర్తు
- సరైన అభ్యర్థులు లేకున్నా ఓటువేసే వీలు
- గత లోక్‌సభ ఎన్నికల్లో 15,832 ఓట్లు

ఖమ్మంసహకారనగర్: త్వరలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనుంది. అయితే, చాలా మంది పోలింగ్ దూరంగా ఉంటుండడంతో ఎన్నికల సంఘం విస్తృతంగా అవగాహన చేపడుతోంది. ప్రతీఒక్కరికి పోలింగ్ స్టేషన్‌కు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా సరైన అభ్యర్థులు లేరనే భావనతో కొందరు విముఖ చూపుతున్నారు. ఈనేపథ్యాన ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈవీఎంల్లో నోటాను ప్రవేశపెట్టింది.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఎన్నికల సంఘం నోటాను 2014లో ప్రవేశపెట్టగా.. చట్టసభల్లో పోటీ చేసే అభ్యర్థులెవరూ నచ్చకపోయినా తమ అభిప్రాయాన్ని తెలపడం కోసం ఇది ఉపయోగపడుతోంది.

రెట్టింపైన ఓట్లు

2014 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి నోటాకు నమోదైన ఓట్ల సంఖ్య రెట్టింపైంది. 2014 ఎన్నికల్లో 4,991ఓట్లు నోటాకు రాగా...2019కు వచ్చే సరికి 15,832ఓట్లు నమోదు కావడం గమనార్హం. పార్టీలు ఇచ్చిన హామీలను విస్మరించడం, అభ్యర్థులు అభివృద్ధి చేస్తారనే నమ్మకం లేకపోవడంతోనే ఇలా జరుగుతోందని భావిస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ పరిధిలోని ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో 5,549నోటాకు ఓట్లు పోల్‌కాగా.. కొత్తగూడెం నియోజకవర్గంలోనూ 3,036ఓట్లు నమోదు కాగా.. ఈ సారి ఎలా ఉంటుందోనన్న చర్చ జరుగుతోంది.



గత రెండు ఎన్నికల్లో ‘నోటా’కు నమోదైన ఓట్లు

నియోజకవర్గం	2014	2019
ఖమ్మం	1,668	5,549
పాలేరు	523	1,973
మధిర	363	1,449
వైరా	406	1,357
సత్తుపల్లి	412	1,509
కొత్తగూడెం	974	3,036
అశ్వారావుపేట	632	929
మొత్తం	4,991	1,5832

బీఆర్‌ఎస్ సమావేశానికి డుమ్మా

- కాంగ్రెస్‌లో చేరేందుకు కొందరి ప్రయత్నాలు..?
- నో ఎంట్రీ అంటున్న తుమ్మల వర్గీయులు

అశ్వారావుపేట: ఖమ్మం పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ మంగళవారం దమ్మపేట మండలం నల్లకుంటలో జరిగిన పార్టీ సమావేశానికి జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, మరికొందరు డుమ్మా కొట్టారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ అరంగేట్రం నుంచి దమ్మపేట మండలానికి చెందిన కొందరు కమర్షియల్ నాయకులు, కాంట్రాక్టర్లు ఆయన ప్రధాన అనుచరులుగా కొనసాగుతున్నారు. షాడో తరహాలో అధికారం చలాయించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే గత ఎన్నికల ముందు తుమ్మల పార్టీ మారే క్రమంలో అల్లిపల్లిలో ఆలపాటి నివాసంలో నిర్వహించిన సమావేశం నుంచి కొందరు ఆయనకు అనుకూలంగా స్పందించలేదు. అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అనుచరులుగా కొనసాగుతున్నవారు.. ఎన్నికల తర్వాత ఎవరు గెలిస్తే వారితో జతకడదామనే ఎత్తుగడతో అధికార పార్టీని వీడలేదు. 2023 ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్, సిట్టింగ్ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కూడా ఓడి పోవడంతో అధికార కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే నల్లకుంటలో మంగళవారం జరిగిన బీఆర్‌ఎస్ సమావేశానికి డుమ్మా కొట్టినట్లు సమాచారం. అయితే తుమ్మలతోపాటు పార్టీ వీడని వారు, గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పనిచేయని వారు, తమ పార్టీకి అవసరం లేదని అధికార పార్టీ నాయకులు పేర్కొంటుండగా... రానున్న స్థానిక ఎన్నికల సమయంలోనైనా తమకు అవకాశం దక్కుతుందనే ఆశతో బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ భూమి అటవీశాఖకు కేటాయింపు

జూలూరుపాడు: జూలూరుపాడు రెవెన్యూగ్రామంలోని 250 సర్వేనంబర్‌లో ఉన్న 106 ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీశాఖకు కేటాయించారు. మంగళవారం కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు ఆ భూమిని సందర్శించగా, రెవెన్యూ అధికారులు సరిహద్దులు చూపించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు కెనాల్ నిర్మాణంతో బయ్యారం మండలం పులుసుబొంత రిజర్వ్‌డ్ ఫారెస్ట్ భూమి కోల్పోవడంతో అటవీశాఖకు భూ బదలాయింపులో భాగంగా జూలూరుపాడు రెవెన్యూ గ్రామంలోని భూమిని ప్రభుత్వం అప్పగించిందని, ఈ భూమిలో అడవి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, ఎఫ్‌ఎస్‌ఓ హనుమంతు, ఎఫ్‌బీఓ బి నరసింహారావు, గిర్దావర్ ఎం.తిరుపతిరావు, సర్వేయర్ శివ, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న అటవీ, రెవెన్యూ అధికారులు

ఎండ తీవ్రతకు ద్విచక్ర వాహనం దగ్ధం

భద్రాచలంఅర్బన్: ఎండ తీవ్రతకు మంటలు చెలరేగి ఓ ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన భద్రాచలంలో మంగళవారం జరిగింది. చర్ల నుంచి వచ్చిన ఓ వ్యక్తి భద్రాచలం సరిహద్దున ఉన్న కూనవరంలో పెళ్లి శుభలేఖలు పంపిణీ చేసి, తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో పాత మార్కెట్ వద్ద ఎండవేడికి ద్విచక్ర వాహనంలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. కాగా తన బైక్ దగ్ధం కావడంతో వాహనదారుడు కన్నీటి పర్యంతమయ్యాడు.



ద్విచక్రవాహనంలో చెలరేగిన మంటలు ఆర్పుతున్న స్థానికులు

పాముకాటు బాధితురాలి ప్రాణం కాపాడిన వైద్యులు

ఖమ్మంవైద్యవిభాగం: పాముకాటుకు గురై ప్రాణాపాయ స్థితికి ఉన్న బాలిక ప్రాణాలను ఖమ్మం పెద్దాస్పత్రి వైద్యులు కాపాడారు. తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్‌కు చెందిన వెంకన్న, లక్ష్మి దంపతుల కుమార్తె మాగి స్పందన సుబ్లేడ్‌లో ఇంటర్ చదువుతోంది. గత శుక్రవారం వారు పక్కింటి దాబాపై పడుకోగా, అర్ధరాత్రి స్పందనను కట్లపాము కాటేసింది. దీంతో ఆమెను 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చేసరికే అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అంతకంతకూ పరిస్థితి జటిలంగా మారుతుండడం, ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లే స్తోమత తల్లిదండ్రులకు లేకపోవడంతో డాక్టర్ నారగోని రాంప్రసాద్ ఆధ్వర్యాన బాలికను ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఆమె పూర్తిగా నీరసించి, న్యూరో పెరాలసిస్ వంటి సమస్యలతో ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లగా వైద్యుల నిరంతర పర్యవేక్షణలో చికిత్స చేస్తూ సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ఈమేరకు స్పందన కోలుకోగా మంగళవారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంప్రసాద్, సిబ్బందిని సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓ బి.అమర్‌సింగ్ అభినందించగా, బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



బాలిక ఆరోగ్యంపై ఆరా తీస్తున్న సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓ

నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

కొత్తగూడెంఅర్బన్: పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ విద్యా సంవత్సరానికి మంగళవారం చివరి వర్కింగ్ డే కాగా, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. వేసవి సెలవులు ఈ నెల 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు ఉండనున్నాయి. ఈ సెలవులు దాదాపు 45 రోజుల పాటు ఉండటంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సుజాతనగర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై సుజాతనగర్ ఠాణాలో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ జుబేదాబేగం కథనం ప్రకారం.. నాయకులగూడెం గ్రామానికి చెందిన బత్తుల పుల్లారావు, కల్యాణి పదిహేనేళ్ల ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం గొడవపడగా కల్యాణి పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెంది పుల్లారావు అదేరోజు రాత్రి తాను ఉరి వేసుకుని చనిపోతున్నాంటూ సోదరునికి ఫోన్ చేశాడు. కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకునే సరికే ఉరి వేసుకున్నాడు. దీంతో తలుపులు పగులగొట్టి పుల్లారావును కిందకు దించి ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుని తల్లి యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ములకలపల్లి: మండలంలోని తిమ్మంపేట పంచాయతీ ఆనందపురం పాఠశాల ఉపాధ్యాయుడు ఎల్.కృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. టీచర్ కృష్ణ ఇటీవల అనుమతి లేకుండా, సెలవు పెట్టకుండా పాఠశాలకు గైర్హాజరయ్యాడు. ఈ విషయాన్ని స్థానికులు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారి ఆదేశాలతో కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు విచారణ చేపట్టి నివేదిక అందజేశారు. దీంతో కృష్ణను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఐటీడీఏ పీఓ ఆదేశాలు జారీ చేశారు.

11 తులాల బంగారం చోరీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ఈ నెల 17న జరిగిన శ్రీరామనవమి వేడుకలకు హాజరైన ఓ భక్తుడి నుంచి 11 తులాల బంగారం చోరీకి గురైంది. చంద్రమౌళి అనే భక్తుడు ఉభయ దాతల పాస్ కొనుగోలు చేసి కల్యాణానికి హాజరయ్యాడు. వేడుకలో రద్దీ అధికంగా ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు బంగారం చోరీ చేశారు. ఈవిషయాన్ని ఆలస్యంగా గుర్తించిన చంద్రమౌళి మంగళవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు భద్రాచలం టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురి అరెస్ట్

మాజీ సర్పంచ్, ఆమె భర్త, సోదరుడికి రిమాండ్

అశ్వారావుపేటరూరల్: దాడి ఘటనలో కేసులో నిందితులుగా ఉన్న ఓ మాజీ సర్పంచ్‌తోపాటు మరో ఇద్దరిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. అదనపు ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన ఒంటిపల్లి శివరామకృష్ణ, అతని తల్లి గంగమ్మను నాటు కోళ్ల విషయంలో అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొడిమి సీత, ఆమె భర్త బత్తుల కొండ, సోదరుడు కొడిమి వినోద్, బంధువు కొడిమి వెంకన్నబాబు మధ్య గత నెల 25న గొడవ జరిగింది. దీంతో శివరామకృష్ణ, అతని తల్లిపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. శివరామకృష్ణకు కాలు, చేయి విరగగా, ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం ఈ నెల 1న ఫిర్యాదు చేయగా, దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులుగా ఉన్న మాజీ సర్పంచ్ సీత, భర్త కొండ, సోదరుడు వినోద్‌ను మంగళవారం అరెస్టు చేశారు. దమ్మపేట కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రామారావు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడు కొడిమి వెంకన్నబాబు పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.

చందా లింగయ్య నామినేషన్..

మానుకోట నుంచి స్వతంత్రంగా బరిలోకి..

కరకగూడెం: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి మంగళవారం ఆదివాసీ సంఘాలు బలపర్చిన మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ మాజీ చైర్మన్ చందా లింగయ్య దొర స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రిటర్నింగ్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతవాసినైన తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి సంఘం రాష్ట్ర నాయకులు, వట్టం ఉపేందర్, పొడుగు శ్రీనాథ్, రమణాల లక్ష్మయ్య, ముక్తి రాజు, కొడెం వెంకటేశ్వర్లు, ఆలం కోటి, రత్నం, చింత కృష్ణ, గుంపెడి వెంకటేశ్వర్లు, గోండ్వానా సంక్షేమ పరిషత్, రాష్ట్ర బాధ్యులు, పాయం సత్యనారాయణ, గిరిజన అభ్యుదయ సంఘం, జిల్లా నాయకులు, వజ్జా, నరసింహారావు గారు, గొగ్గల రామకృష్ణ, వట్టం కన్నయ్య, వాసం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న చందా లింగయ్య

కరకట్ట పనులు త్వరగా పూర్తి చేయాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి వరద పట్టణంలోకి రాకుండా నిర్మిస్తున్న కరకట్ట పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గతంలో మిగిలిపోయిన కరకట్ట నిర్మాణ ఇటీవల ప్రారంభించగా పనులను మంత్రి మంగళవారం పరిశీలించి మాట్లాడారు. వరద సమస్య నుంచి భద్రాచలం పట్టణవాసులకు ఉపశమం కలిగించేందుకే కరకట్ట పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న వర్షాకాలం నాటికి పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కరకట్ట పనులపై ఆరా తీస్తున్న మంత్రి తుమ్మల